జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 20-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 760 పేజీలు: 4 వెల : రూ.7





* లొంగిపోయినా మాజీ మావోయిస్టును వదలని ఒడిశా ప్రభుత్వం
* మాజీ మావోయిస్టుకు కేశవరావుకు స్వేచ్ఛావాయువులు
* 68 కేసుల నుంచి విముక్తి
* 15 ఏళ్లకు పైగా నిర్బంధం
* స్వగ్రామం వచ్చిన దున్న కేశవరావు అలియాస్ ఆజాద్
* నల్లబొడ్లూరులో సంబరాలు

# ఫలించిన మాతృమూర్తి.. 15 ఏళ్ల పోరాటం

మందస, ఆగస్టు 19(వార్త): ఒక మనిషి జీవితంలో పదిహేనేళ్లు అంటే చిన్న కాలం కాదు. ఒక తరం ఎదగడానికి సరిపడే కాలం. ఒక కుటుంబం ఎన్నో మార్పులను చూడగల కాలం. కానీ అదే పదిహేనేళ్లకు పైగా ఒక మనిషి జైలు గోడల మధ్య గడపాల్సి వస్తే... ఆ వేదనను మాటల్లో చెప్పడం కష్టం. అలాంటి సుదీర్ఘ నిర్బంధ జీవితాన్ని ఎదుర్కొన్న వ్యక్తి శ్రీకాకుళం జిల్లా మందస మండలం నల్లబొడ్లూరు గ్రామానికి చెందిన దున్న కేశవరావు అలియాస్ ఆజాద్. సుమారు 25 ఏళ్ల అజ్ఞాతవాసం తర్వాత జనజీవన స్రవంతిలోకి రావాలని నిర్ణయించుకున్న కేశవరావు 2011 మే 18న హైదరాబాద్‌లో అప్పటి ఆంధ్రప్రదేశ్ డీజీపీ కె.అరవిందరావు సమక్షంలో లొంగిపోయారు. లొంగిపోయిన తర్వాత ఇక సాధారణ జీవితం ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఆశించారు. కానీ ఆ ఆశ ఎక్కువకాలం నిలవలేదు. లొంగుబాటు తర్వాతే మరో అధ్యాయం ప్రారంభమైంది. లొంగిపోయిన కొద్ది రోజులకే ఒడిశా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. 2011 మే 29న కస్టడీలోకి తీసుకుని, జూన్ 2న అరెస్టు చూపించారు. అనంతరం కోర్టుల ముందు హాజరుపరుస్తూ భువనేశ్వర్‌లోని జార్పడ హై సెక్యూరిటీ జైలుకు తరలించారు. అక్కడి నుంచి ప్రారంభమైంది ఒక సుదీర్ఘ నిర్బంధ జీవితం. ఒడిశాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయనపై కేసులు నమోదయ్యాయి. రికార్డుల ప్రకారం మొత్తం 68 కేసులు. ఆంధ్రప్రదేశ్‌లో 16 కేసులు, ఒడిశాలో 52 కేసులు కేసులపై కేసులు.. రిమాండ్‌లు.. కోర్టు హాజరులు.. వాయిదాలు.. ఇలా సంవత్సరాలు గడిచిపోయాయి. ఒకప్పుడు అజ్ఞాతంలో గడిచిన జీవితం ముగిసిందనుకున్న సమయంలో మరో రూపంలో నిర్బంధ జీవితం కొనసాగింది. జైలు గోడల మధ్య కూడా న్యాయం కోసం పోరాటమే. సాధారణంగా నక్సలైట్లు లొంగుబాటు అంటే జనజీవన స్రవంతిలోకి తిరిగి రావడానికి ఒక మార్గం కావాలి. కానీ కేశవరావు విషయంలో లొంగుబాటు తర్వాత కూడా జైలు జీవితం కొనసాగింది. తనపై ఉన్న కేసుల విచారణ వేగవంతం కావాలని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని కోరుతూ కేశవరావు జైలు నుంచే న్యాయపోరాటం కొనసాగించారు. జైలు గోడల మధ్య కూడా తన స్వరం వినిపించేందుకు నిరాహార దీక్షకు దిగారు. 2025లో జార్పడ జైలులో ఆయన చేపట్టిన నిరాహార దీక్ష తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఆయన ఆరోగ్య పరిస్థితిపై పౌరహక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేసి, మెరుగైన వైద్యం, కేసుల సత్వర విచారణ కోసం ప్రభుత్వాలను కోరాయి.

## సుప్రీంకోర్టు జోక్యం..

సుదీర్ఘకాలంగా కేసులు పెండింగ్‌లో ఉండటంతో కేశవరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆయనపై ఉన్న కేసుల సత్వర విచారణ కోసం ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో ప్రత్యేక న్యాయస్థానాల ఏర్పాటు, పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేయడం వంటి అంశాలపై న్యాయపరమైన పోరాటం కొనసాగింది. ఆ తర్వాత శ్రీకాకుళంలో కూడా ఆయనకు సంబంధించిన కేసుల సత్వర విచారణ కోసం ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఇది కేవలం ఒక ఖైదీ కేసు కాదు ఒక మనిషి జీవితంలో సంవత్సరాలు గడిచిపోతున్నప్పుడు న్యాయ ప్రక్రియ ఎంత వేగంగా ఉండాలి? లొంగిపోయిన వ్యక్తికి సాధారణ జీవితం అనే ఆశకు విలువ ఎంత? విచారణ ఆలస్యం ఒక వ్యక్తి జీవితంపై ఎంతటి ప్రభావం చూపుతుంది? అనే ప్రశ్నలను కూడా కేశవరావు సుదీర్ఘ నిర్బంధం సమాజం ముందుకు తీసుకొచ్చింది.

## తల్లి, భార్య సుదీర్ఘ పోరాటం..

ఒక కొడుకు జైలులో ఉంటే, బయట ఉన్న తల్లి గుండె కూడా జైలు గోడల మధ్యే ఉంటుంది. దున్న కేశవరావు తల్లి దున్న కాములమ్మ తన కుమారుడి విడుదల కోసం ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాలను, అధికారులను, న్యాయవ్యవస్థను వేడుకున్నారు. అదే సమయంలో ఆయన భార్య శాంతి కూడా తన భర్త కోసం సుదీర్ఘంగా ఎదురుచూస్తూ, కుటుంబంతో కలిసి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. ఒక తల్లి పోరాటం.. ఒక భార్య నిరీక్షణ.. ఒక కుటుంబం కన్నీళ్లు..ఇవన్నీ కలిసి సాగిన సుదీర్ఘ ప్రయాణం ఇది. నా కొడుకు లొంగిపోయాడు.. అతనికి న్యాయం చేయండి అనే తల్లి విజ్ఞప్తి సంవత్సరాలుగా వినిపిస్తూనే ఉంది. అమ్మ చేసిన పూజలు, ప్రార్థనలు. భార్య చేసిన నిరీక్షణ, కుటుంబం చేసిన పోరాటం ఇవన్నీ చివరకు ఒక ఆశాజనకమైన మలుపునకు చేరుకున్నాయి.

## 68 కేసుల నుంచి విముక్తి..

ఏళ్ల తరబడి సాగిన న్యాయపోరాటం అనంతరం దున్న కేశవరావు అలియాస్ ఆజాద్ మొత్తం 68 కేసుల నుంచి నిర్దోషిగా విడుదలయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో 16 కేసులు, ఒడిశాలో 52 కేసులు, మొత్తం 68 కేసులు. ఇన్ని కేసులు, ఇన్ని కోర్టులు, ఇన్ని సంవత్సరాలు. చివరకు భువనేశ్వర్‌లోని జార్పడ జైలు గేట్లు ఆయన కోసం తెరుచుకున్నాయి. ఇది కేవలం ఒక జైలు విడుదల కాదు. 15 ఏళ్లకు పైగా సాగిన నిరీక్షణకు ముగింపు. 16వ సంవత్సరంలోకి సాగిన నిర్బంధ జీవితానికి ముగింపు. 68 కేసుల న్యాయపోరాటానికి ఒక కీలక ముగింపు. ఒక తల్లి ఎదురుచూపులకు సమాధానం. ఒక భార్య సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు. ఒక కుటుంబం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన కలకు సాకారమైంది. దున్న కేశవరావు కుటుంబసభ్యులు ఆనందోత్సవాలు చేసుకున్నారు. ఉద్యమ సహచరులు మార్పు వెంకటరమణ అలియాస్ క్రిష్ణ, కూనే కోదండరావు అలియాస్ ప్రకాష్, వేణు, మోహన్, చంటి, సీతక్క, భారతి, సుమిత్ర, ఉద్యమ అభిమానులు, ఉద్దానం ప్రజలు కేశవరావు అలియాస్ ఆజాద్‌కు మిఠాయిలు తినిపించారు. సుదీర్ఘ కాలం పోరాటం చేసిన తల్లి కాములమ్మకు అభినందనలు తెలిపారు.





# కీచక గురువు

* ఓ బాలికపై ఉపాధ్యాయుడి వికృత చేష్టలు
* ప్రేమిస్తున్నానంటూ వెంటపడుతున్న వైనం
* ఉపాధ్యాయుడి తీరుపై విమర్శలు
* వ్యవహారం బయటపడడంతో హెచ్ఎంను ప్రశ్నించిన తల్లిదండ్రులు
* పాఠశాలలో విచారణ జరిపిన డిప్యూటీ డీఈవో

సోంపేట, ఆగస్టు 19 (వార్త): పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు.. తానే క్రమశిక్షణ కోల్పోయి బాలికల పట్ల కీచకుడిగా మారిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పదో తరగతి నుంచి విద్యార్థినితో ప్రేమాయణం సాగించి ఇంటర్మీడియట్ కు వచ్చేసరికి ఆ బాలికతో మరింత చనువుగా ప్రవర్తించి నలుగురిలో నవ్వుల పాలైన ఉపాధ్యాయుని వ్యవహారం కంచిలి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత బాలిక తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ప్రశ్నించడంతో విషయం ఉన్నతాధికారుల వరకు వెళ్లి విచారణ కూడా జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం వివరాలు ఇలా ఉన్నాయి. కంచిలి జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న వ్యక్తి అదే పాఠశాలలో గతంలో చదువుకున్న ఓ బాలిక పట్ల కన్నేశాడు. పదో తరగతి పూర్తయి ప్రస్తుతం ఆ బాలిక పక్కనే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. పాఠశాల మారినప్పటికీ కీచక ఉపాధ్యాయుడి వేధింపులు ఆగలేదు. తల్లిదండ్రుల దృష్టికి ఈ సమాచారం చేరడంతో ఇటీవల కొద్ది రోజుల క్రితం వారు పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడిని నిలదీశారు. బాలిక పట్ల వికృత చేష్టలకు పాల్పడుతున్న ఉపాధ్యాయుడి తీరును తప్పుపట్టారు. ఈ వ్యవహారంపై ప్రధానోపాధ్యాయుడు విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. దీనిపై డిప్యూటీ డీఈవో పాఠశాలకు వచ్చి ఇటీవల అందరినీ విచారించి నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారికి సమర్పించినట్లు తెలిసింది. హెచ్ఎం చాణక్య వద్ద బుధవారం స్థానిక విలేకరులు వివరణ కోరగా ఈ వ్యవహారంపై ఇప్పటికే డిప్యూటీ డిఈఓ విచారణ జరిగిందన్నారు.

## 21న మందసలో సాముహిక వరలక్ష్మి వ్రతం

**మందస, ఆగస్టు 19(వార్త):** మందసలోని శ్రీఅన్నపూర్ణమ్మతల్లి దేవాలయం ప్రాంగణంలో ఈ నెల 21న 9గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తున్నట్టు శ్రీఅన్నపూర్ణమ్మతల్లి దేవాలయ అభివృద్ధి కమిటీ, శ్రీదుర్గాభవాని సన్నధానం ప్రతినిథులు చెప్పారు. వ్రతం అనంతరం భక్తులకు మహాఅన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు. వరలక్ష్మి వ్రతంలో భక్తులు, గ్రామ ప్రజలు కుటుంబ సమేతంగా పాల్గొని, కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు.

## లింబిగాం పాఠశాలను సందర్శించిన ఎంఈఓ భాస్కరరావు



**మందస, ఆగస్టు 19(వార్త):** మందస మండల విద్యాశాఖాధికారి-2 మర్రిపాటి భాస్కరరావు అంబుగాం పంచాయతీలోని లింబిగాం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. భాగంగా పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసి, తగు సూచనలు చేశారు. అదేవిధంగా పాఠశాలలో ఉన్న ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. ముఖ్యంగా పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు సలహాలు ఇచ్చారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మార్పు జగన్మోహనరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్డిక సామజిక వర్గానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 19 (వార్త):** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ను రాష్ట్ర బి.సి. రెడ్డిక సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొండా శంకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్డిక సామాజిక వర్గ సమస్యల పరిష్కారం కోసం పలు కీలక వినతులతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్‌కు వెంటనే డైరెక్టర్లను నియమించాలని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ రెడ్డిక సామాజిక వర్గ నిరుపేద కుటుంబాలకు కల్పించాలని అన్నారు. రెడ్డిక వర్గం విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం ప్రత్యేకంగా "రెడ్డిక రెసిడెన్షియల్ పాఠశాలలు" ఏర్పాటు చేయాలని,బీసీ రెడ్డిక వర్గానికి చెందిన నిరుద్యోగ యువతకు రైతు పనిముట్లుకు బీసీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, ప్రతి మండలంలో రెడ్డిక వర్గ సంక్షేమసమావేశాల కోసం ప్రత్యేక "సామాజిక భవనాలు" నిర్మించాలని కోరారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలో విద్యార్థులకు సాంకేతిక విద్యనందించేందుకు ఐటీఐ సంస్థను మంజూరు చేయాలని ఈ ప్రాంతం నుంచి ఉపాధి కోసం ఎక్కువ మంది వలస వెళ్తున్నందున, వలసలను అరికట్టేందుకు స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు పెంచాలని కోరారు. ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## సొండిపూడి హైస్కూలుకు అంబేడ్కర్ చిత్రపటం బహూకరణ



**మందస, ఆగస్టు 19(వార్త):** సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కాళ్ల దీక్షిత అనే విద్యార్థిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని బహూకరించింది. 10వ తరగతి చదువుతున్న దీక్షిత పుట్టినరోజు సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చిత్రపటాన్ని పాఠశాలకు బహూకరించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నగిరి కరుణాకర్ మాట్లాడుతూ దీక్షితకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు తమ పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలకు మంచి మొక్కలను గాని, జాతీయ నాయకుల చిత్రపటాలు కానీ ఇవ్వాలని కోరారు.

## నడిరోడ్డుపై ద్విచక్రవాహనం దగ్ధం



**ఆమదాలవలస, ఆగస్టు 19 (వార్త):** ఆమదాలవలస పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం సమీపంలోని ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న ఓ ద్విచక్ర వాహనంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. క్షణాల వ్యవధిలోనే మంటలు బైక్ మొత్తానికి వ్యాపించాయి. గమనించిన వాహనదారుడు వెంటనే పక్కకు తప్పుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది,స్థానికులు మంటలను అదుపు చేసేలోపే వాహనం పూర్తిగా బూడిదైంది. షార్ట్ సర్క్యూ ట్ కారణంగానే మంటలు అంటుకుని ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు.







# సమయానికి రారు..పోతారు..!

**-సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులు**

**-తూతూ మంత్రంగా మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ**

**-పీఆర్ఎస్ సమస్యలను పరిష్కరించ లేరా బాబు అంటూ అర్జీదారుల ఆవేదన**

**జి.సిగడాం, ఆగస్టు 19(వార్త):** జి.సిగడాం మండలంలో పలు సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని ప్రజలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని సచివాలయాల్లో సమయానికి ఇద్దరు లేదా ఒకరు వచ్చి సచివాలయాల తలుపులు తీస్తున్నారు. మరికొందరు సర్వేల పేరుతో లేదా సంబంధిత శాఖా కార్యాలయాలకు వెళ్తు న్నామని చెబుతూ ఉద్యోగ విధులకు దుమ్మా కొడుతున్నారు. మండల ప్రజా పరిషత్ అధికారులు, మండల పత్యేక అధికారులు, సంబంధిత శాఖాధికారుల పరిపాలన నిమ్మకు నీరెత్తినట్లు ఉందని ప్రజల నుంచి గుసగుసలు వినిపిస్తు న్నాయి. ముఖ్యంగా జి.సిగడాం మండల అధికారుల పర్యవేక్షణ మొక్కుబడులకు మారుపేరుగా మారిందని సచివాలయాలకు వచ్చే పలువురు చెప్పుకొస్తున్నారు. పీజీఆర్ఎస్ లో వచ్చే ఫిర్యాదులను అర్జీదారుడునకు తెలియకుండా మూసివేస్తున్నారని, ముఖ్యంగా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల వారు ఇలా ఉన్నారంటూ అవేదన చెందుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న హౌషింగ్ కార్యాలయం ఎప్పటిక ప్పుడు తలుపులు మూసి ఉంటుందని ప్రజా ప్రతినిధులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని పలువురు కోరుతున్నారు.



## విద్యార్థినులకు పోలీసుల అవగాహన

**డగ్స్ నిరోధకత, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మహిళా భద్రతపై అవగాహన కల్పించిన ఎస్ఐ అప్పలసూరి**

**జి.సిగడాం, ఆగస్టు 19(వార్త):** విద్యార్థులకు పోలీసు శాఖ, చట్టాలు, రాజ్యాంగ చట్టాల విధులపై అవగాహన కలిగి ఉండాలని ఎస్.ఐ అప్పల సూరి అన్నారు. బుధవారం మండల కేంద్రలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అభయం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగ చట్టాలు,పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ పోలీసులు కేవలం నేరస్థులను పట్టుకోవడమే కాకుండా సమాజంలో శాంతి భద్రతలు, చట్టపరమైన అవగాహన పెంపునకు నిరంతరం కృషి చేస్తారన్నారు. ప్రజల రక్షణ, మహిళ భద్రత, నేరాల నియంత్రణకు పని చేస్తుందని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చునని చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. యువత గంజాయి, డ్రగ్స్, మత్తు పదా ర్థాలకు దూరంగా ఉండాలన్నారు. యాప్‌ల ద్వారా రుణాలు తీసుకుంటూ చెల్లించకపోవడం వల్ల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, యాప్‌లపై అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. అనంతరం విలేఖర్లు తో మాట్లాడుతూ విద్యార్థుల్లో భద్రతాభావం పెంపొందించడానికి, నేరాల పట్ల అవగాహన కల్పించడానికి మరియు పోలీసులకు, యువతకు మధ్య సత్సంబంధాలు మెరుగుపరచడానికి విద్యాసంస్థల్లో పోలీసుల ఆధ్వర్యంలో 'అభయం' లేదా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని. వీటి ద్వారా విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉంటూ, ధైర్యంగా ముందుకు వెళ్లేందుకు సహాయపడతాన్నారు. వారితో పాటు ఎఎస్ఐ రామకృష్ణారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



## బుడారిసింగి, కొండలోగాంలో ఇంటింటికీ తెలుగుదేశం

**- కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాల ప్రచారం**

**-10వేల ఇళ్లను సందర్శించాం**

**- టీడీపీ అధ్యక్షుడు బావన దుర్యోధన**

**మందస, ఆగస్టు 19(వార్త):** తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం'(కూటమి ప్రభుత్వ సంక్షేమ విజయాలు) కార్యక్రమం మందస మండలంలో విజయవంతంగా కొనసాగుతున్నట్టు తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యధన చెప్పారు. మందస మండల పరిధిలోని బుడారిసింగి, కొండలోగాం గ్రామ పంచాయతీలలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రతీ ఇంటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన నాయకత్వం వహించారు.

వారితో పాటు క్లస్టర్ ఇన్‌చార్జ్ ముంజేటి చంద్రశేఖర్, యూనిట్ కన్వీనర్ సవర ప్రశాంత్, సీనియర్ నాయకులు సవర లక్ష్య తదితర ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం బావన దుర్యోధన మాట్లాడుతూ మందస మండలంలో ఇప్పటివరకు విజయవంతంగా 10,000 ఇళ్లను సందర్శించి సంక్షేమ ఫలాలను వివరించినట్లు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమంలో అహర్నిశలు శ్రమిస్తున్న నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఆయన పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్తామని పిలుపునిచ్చారు.



### ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళమెత్తుతున్న

## గౌతు శిరీష తీరు అభినందనీయం

**- పలాస నియోజకవర్గ అభివృద్ధికి సమర్థవంతమైన ప్రాతినిధ్యం**

**- ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు**



**పలాస, ఆగస్టు 19 (వార్త):** ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తీరు అభినందనీయమని ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. పలాస నియోజకవర్గ సమస్యలను క్షేత్రస్థాయి నుంచి గుర్తించి సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పరిష్కార మార్గాలపై దృష్టి సారిస్తున్నారని తెలిపారు. గత పాలనలో అసెంబ్లీ వేదిక రాజకీయ విమర్శలు, ఆరోపణలకే పరిమితమైందని ఆయన విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా సభలో చర్చకు వస్తున్నాయని తెలిపారు. పలాస నియోజకవర్గంలోని మూడు మండలాలు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి అవసరాలపై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు.

### సమస్య ప్రస్తావనతో పాటు పరిష్కారంపై దృష్టి

రహదారులు, తాగునీరు, సాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, ఉపాధి అవకాశాలు, పట్టణ మౌలిక వసతుల వంటి అంశాలపై ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారని వజ్జ బాబూరావు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, జిల్లా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలపై సమన్వయ దృష్టి సారిస్తూ పలాస నియోజకవర్గంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల అభివృద్ధి అవసరాలు వేర్వేరుగా ఉన్నాయని, వాటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించడం అవసరమన్నారు. మూడు మండలాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి ఎమ్మెల్యే చేస్తున్న ప్రయత్నాలు సానుకూల ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. ప్రజలతో నిరంతరం మమేకమై క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని, వాటిని ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేయడం బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిత్వానికి నిదర్శనమన్నారు. అభివృద్ధి రాజకీయాలకు నిదర్శనమని, ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా గౌతు శిరీష ముందుకు సాగుతున్నారని వజ్జ బాబూరావు అన్నారు. ప్రజల గొంతుకగా అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావిస్తూ, పరిష్కారానికి మార్గాలు చూపుతున్న ఎమ్మెల్యేకు ప్రజల తరఫున అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పలాస నియోజకవర్గానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## పాలనలో ప్రజల సంతృప్తే ప్రధానం



**శ్రీకాకుళం, ఆగస్టు 19 (వార్త):** ప్రజా సమస్యల పరిష్కారంలోనూ, వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులోనూ జిల్లా యంత్రాంగం 'ప్రజా సానుకూల దృక్పథం' ప్రాతిపదికగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, పాలనలో ప్రజల సంతృప్తి మాత్రమే సర్వోత్తమ సూచిక అని తేల్చిచెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రతీ అధికారి ప్రజా సమస్యలను పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ రంగాల్లో జిల్లా సాధించిన ప్రగతిని కలెక్టర్ వెల్లడించారు. పట్టణ స్వయం సహాయక సంఘాల పనితీరులో శ్రీకాకుళం జిల్లా 81.50శాతం స్కోరుతో రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలవగా, సేవా రంగానికి సంబంధించి 100 కి 96 మార్కులతో ఏం గ్రేడ్ సాధించింది. అలాగే డిజిటల్ రెవెన్యూ సేవల విభాగంలో 78.70శాతం స్కోరుతో రాష్ట్రస్థాయిలో 3వ ర్యాంకు, జిల్లా సమగ్ర కేపీఐ లో 78/100 స్కోరుతో 'గ్రేడ్ ఏ కేటగిరీ దక్కించుకుంది. అంతేకాకుండా, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో వచ్చిన 85,767 అర్జీలలో ఇప్పటివరకు 82,661 (96.4%) పరిష్కరించి జిల్లా యంత్రాంగం వేగవంతమైన పురోగతి కనబరిచింది. ఆరోగ్య భద్రత, పారిశుధ్య నిర్వహణపై సమీక్షిస్తూ.. జిల్లావ్యాప్తంగా పరీక్షించిన 5,261 తాగునీటి నమూనాలు 100% సురక్షితమైనవిగా తేలాయని, ఈ వారంలో సున్నా మలేరియా కేసులు నమోదు కావడం ప్రశంసనీయమని కలెక్టర్ చెప్పారు. ఉపాధి, వ్యవసాయ విభాగాలకు సంబంధించి ఇ-పంట నమోదును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, కేవలం అర్జీల పరిష్కార శాతమే కాకుండా అర్జీదారుల సంతృప్తి శాతాన్ని పెంచేలా యంత్రాంగం పనిచేయాలని సూచించారు. ప్రజా సంక్షేమంలో భాగమైన ఉచిత ఎల్పీజీ సిలిండర్ల పంపిణీ 'దీపం 2.0' పథకం అమలును జిల్లాలో మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతోపాటు ఉచిత ఇసుక విధానం ప్రజలకు సులభంగా అందుబాటులోకి వచ్చేలా చూడాలని, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకతను పాటించాలని స్పష్టం చేశారు. వివిధ రంగాల సమీక్ష, పురోగతిపై ఆదేశాలు:పాలనలో ప్రజా సానుకూల దృక్పథానికి ప్రాధాన్యమిస్తూ డిజిటల్ రెవెన్యూ సేవలు మినహా మిగిలిన విభాగాలు తమ ప్రగతిని మరింత మెరుగుపరచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, పలాస కిడ్నీ పరిశోధనాస్పత్రి, డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సర్వీసెస్ సేవలను మరింత వేగవంతం చేయాలని, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అందే సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సిపిఓ ఆధ్వర్యంలో జిల్లా కేపీఐ, జీడీపీ, జీఎస్‌డీపీ సూచికల నమోదును నిశితంగా పరిశీలించాలని పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధిలో భాగమైన 'ఆర్ అండ్ బి' గుంతల పూడ్చివేత పనులను పూర్తి చేయాలని, హౌసింగ్ 1.0 ఇళ్ల నిర్మాణ ప్రక్రియను త్వరగా కొలిక్కి తేలేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. సమావేశానికి ఆయా మండలాల నుంచి తహసిల్దారులు, ఎంపీడీవోలు ఇతర సిబ్బంది వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మోడీ విధానాలపై ముప్పేట పోరాటానికి సిద్ధం

- ఎన్డీఏ పాలనలో ఆర్థిక విధ్వంసం
- రాజ్యాంగ మార్పుల దిశగా మోడీ ప్రభుత్వం అడుగులు
- చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్ మోడీ భజనకే పరిమితం
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలు ఉధృతం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య




**పలాస, ఆగస్టు 19 (వార్త):** కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిరంకుశ నియంతృత్వ అరాచక పాలనను ప్రశ్నిస్తున్న వారిపై దిమాగ్ నక్సల్స్ అంటూ ప్రధాని మోడీ సంభోదించడంపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా ధ్వజమెత్తారు. ఈ దేశంలో ప్రస్తుతం జెన్ జీ అయినా, జెన్ ఆల్ఫా అయినా దిమాగ్ నక్షల్స్ అన్నా.. అన్నీ తామేనని కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని భరతం పట్టడానికి భారత కమ్యూనిస్టు పార్టీ ( సీపీఐ) సిద్ధమైందని ఈశ్వరయ్య హెచ్చరించారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా పలాస రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో సీపీఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో ప్రధాని మోడీ 12 ఏళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా ఛిన్నభిన్నమైందని ఆరోపించారు. 2014 వరకు 14 మంది ప్రధాన మంత్రులు 55 లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేస్తే, ఒక్క మోడీ సుమారు 200 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేశారని దుయ్యబట్టారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూపాయి విలువ భారీగా పడిపోయిందని, ప్రజల కొనుగోలు శక్తి క్షీణించిందని అన్నారు. దేశంలో రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోతున్నాయని, సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోడీ సుమారు రూ. 200 లక్షల కోట్ల అప్పులు చేసినప్పటికీ దేశంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్ఐసీ, టెలికాం, నౌకాశ్రయాల వంటి కీలక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు తాకట్టు పెట్టేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే 'దిమాగ్ నక్సల్స్' అంటూ విమర్శించడం సరికాదన్నారు. మోడీ ఏమనుకున్నా దేశం లో యువత, ప్రజలు అన్నింటికీ తగిన సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని, సెప్టెంబర్ 1న తలపెట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు లోకేశ్, పవన్ కళ్యాణ్ లు ప్రధాని మోడీని పొగడటానికే పరిమితమయ్యారని ఈశ్వరయ్య విమర్శించారు. డబల్ ఇంజిన్ సర్కార్ తో ఎపి కి ఒరిగిందేమి లేదని, ఆంధ్రప్రదేశ్ లోను, పక్కనే సాగు నీటి జలవివాదాలు ఉన్న ఒరిస్సాలోను, కేంద్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్నప్పటికీ నదీ జలాల వివాదాలు పరిష్కారం చేసి ఉత్తరాంధ్రను కరువు కోరలు నుండి విముక్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే ఆలోచన చంద్రబాబుకు, లోకేష్ కు, పవన్ కళ్యాణ్ కు లేదని, ఈ రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడని డబుల్ ఇంజన్ సర్కార్ అని గొప్పలు దేనికి చెబుతున్నారని ఈశ్వరయ్య ప్రశ్నించారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ తో ఉత్తరాంధ్రకు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏదో జరిగిపోతుంది అంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎయిర్ పోర్టు కడితే ఏమవుతుందో ఏం జరిగిపోతుందో ప్రజలందరికీ తెలుసునని అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర-రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీల గురించి మాట్లాడటం లేదన్నారు. వంశధార-నాగావళి నదుల అనుసంధానానికి నిధులు అడగకుండా తమ కుర్చీలను కాపాడుకోవడానికే మోడీ భజన చేస్తున్నారని మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ రాక సందర్భంలో గిరిజనులతో ధింసా నృత్యాన్ని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాల విభజన తరువాత శ్రీకాకుళంలో ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని, వారి సమస్యలపై సీపీఐ కచ్చితంగా పోరాడుతుందని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజా సమస్యల గొంతుకగా సీపీఐ పోటీ చేస్తుందని ఆయన ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగ ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చాపర సుందర్ లాల్, ఎస్.నారాయణ స్వామి, కొన్న శ్రీనివాసరావు, పి.ఆరేలమ్మ, సనపల నరసింహులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## పీఎంఈపీ, పీఎంఫ్ఎం పథకాల రుణాలు మంజూరు చేయాలి



**వజ్రపుకొత్తూరు/మందస, ఆగస్టు 19(వార్త):** పీఎంఈపీ, పీఎంఫ్ఎం పథకాలను మంజూరు చేయాలని వెలుగు ఏపీఎం గొడబ ప్రసాదరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని యూనియన్ బ్యాంక్ అక్కుపల్లి బ్యాంక్ పరిధిలో సిబిఆర్ఎం( కమ్యూనిటీ బేస్డ్ రికవరీ మెకానిజం) మీటింగ్ ను నిర్వహించారు. సమావేశంలో ఎపిఎం గొడబ మాట్లాడుతూ ఎంసీపీ ప్రకారం ఆగస్టు నెలవరకు బ్యాంక్ లింకేజ్ ఎలిజిబిలిటీ గ్రూప్స్ కు లింకేజీస్ చేయించుకోవాలని అక్కుపల్లి క్లస్టర్ విఓఎలకు తెలిపారు. ఆయా విఓ పరిధిలో ఎన్ పిఎ సంఘాలు ఉన్న రికవరీ కట్టించాలని వివోఎలకు ఏపీఎం సూచించారు. అలాగే బ్రాంచ్ పరిధిలో పిఎంఈజిపి, పిఎంఫ్ఎం ఈ పథకాలను శాంక్షన్ ఇవ్వాలని బ్రాంచ్ మేనేజర్ కోరారు. అలాగే సెర్ప్ ద్వారా అమలు అవుతున్న ఎంసీపీ ప్రకారంబ్యాంక్ లింకేజ్ ద్వారా మహిళలను తీసుకుంటున్న డబ్బులను ఎంటర్ ప్రెన్యూర్ గా తయారు కావడానికి ఉపయోగించుకొనే టట్లు వివోఎ లు వివోలలో అవగాహన చెయ్యాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం గొడబ ప్రసాదరావు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ మహంతి, ఆర్ డివో అశోక్, అక్కుపల్లి క్లస్టర్ విఓఎలు పాల్గొన్నారు.

## ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ



**ఇచ్ఛాపురం, ఆగస్టు 19 (వార్త):** పాయి తారీ గ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షులు లోపింటి పద్మనాభం, పి ఏ సి ఎస్ డైరెక్టర్ గిన్ని బాలరాజు,వలపల నిరంజన్,లెంక మురళీకృష్ణ, వలపల తులసి, గ్రామస్తులు పాల్గొన్నారు. 11 వ వార్డు లో జిల్లా తెలుగు మహిళా కార్యదర్శి ఆశి లీలా రాణి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు.

# యువతలో వ్యసన విముక్తిపై అవగాహన

- నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ
- యువతలో మానసిక పరివర్తన అవసరమన్న ప్రిన్సిపల్ పెద్దాడ లత
- 10 కోట్ల మందిని ప్రతిజ్ఞలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యం




**నరసన్నపేట, ఆగస్టు 19 (వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువతను వ్యసనాలకు దూరంగా ఉంచి ఆరోగ్యకరమైన జీవన విధానం వైపు నడిపించేందుకు వ్యసన విముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని వ్యసనాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పెద్దాడ లత మాట్లాడుతూ యువతలో మార్పు తీసుకురావడానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. మత్తు పదార్థాలు, ఇతర వ్యసనాల ప్రభావం వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. యువతలో మానసిక పరివర్తన తీసుకురావడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడవచ్చన్నారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు ఓం శాంతి, బాలామణి, ఈశ్వరి, శాంతారావు మాట్లాడుతూ వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దేశవ్యాప్తంగా 10 కోట్ల మందిని వ్యసన విముక్తి ప్రతిజ్ఞ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు చిన్న వయసులోనే వ్యసనాలకు దూరంగా ఉండి, తమ భవిష్యత్తును విద్య, నైపుణ్యాలు, సత్ప్రవర్తనతో తీర్చిదిద్దుకోవాలని వారు సూచించారు. కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో వ్యసనాల పట్ల అవగాహన పెంచడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపై చైతన్యం కలిగించింది.

# ప్రింటర్లు మొరాయింపు.. పోస్టాఫీసులో సేవలకు అంతరాయం

- వారం రోజులుగా పనిచేయని ప్రింటర్లతో వినియోగదారులకు ఇబ్బందులు
- కాట్రిడ్జ్‌లు అందుబాటులో లేకపోవడమే కారణమని పోస్టుమాస్టర్ వివరణ
- జనరేటర్ కూడా పనిచేయకపోవడంతో విద్యుత్ అంతరాయ సమయంలో సేవలకు బ్రేక్

**నరసన్నపేట, ఆగస్టు 19 (వార్త):** నరసన్నపేట ప్రధాన పోస్టాఫీసు బ్రాంచ్‌లో సాంకేతిక సమస్యలు వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కార్యాలయంలోని ప్రింటర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో వారం రోజులుగా పలు పోస్టల్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అవసరమైన పత్రాలు, రసీదులు తదితరాలను ప్రింట్ చేసుకోవడంలో జాప్యం జరుగుతుండటంతో కార్యాలయానికి వచ్చే వినియోగదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రింటర్లు పనిచేయకపోవడానికి గల కారణాలపై పోస్టుమాస్టర్ రామారావును వివరణ కోరగా.. ప్రింటర్లకు అవసరమైన కాట్రిడ్జ్‌లు అందుబాటులో లేకపోవడం వల్లే సమస్య ఏర్పడిందని తెలిపారు. కాట్రిడ్జ్‌ల సరఫరా లేకపోవడంతో ప్రింటింగ్ సేవలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. మరోవైపు కార్యాలయంలోని జనరేటర్ కూడా పనిచేయకపోవడం సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన సమయంలో ప్రత్యామ్నాయ విద్యుత్ సదుపాయం లేకపోవడంతో పోస్టాఫీసులో సేవలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి నెలకొంటోందని వినియోగదారులు, సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన పోస్టాఫీసుకు ప్రతిరోజూ వివిధ అవసరాల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ప్రింటర్లు, జనరేటర్ వంటి కీలక సదుపాయాలు పనిచేయకపోవడం వల్ల సమయం వృథా కావడంతో పాటు సేవలు ఆలస్యమవుతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాట్రిడ్జ్‌లను వెంటనే అందుబాటులోకి తీసుకురావడంతో పాటు జనరేటర్‌ను మరమ్మతు చేసి పోస్టల్ సేవలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



# సచివాలయ భవనం వద్ద అనధికారిక పార్కింగ్‌తో ఇబ్బందులు

- సారవకోట సచివాలయం దిగువ భాగంలో ఇష్టారాజ్యంగా వాహనాల నిలుపుదల
- దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు పార్కింగ్ సదుపాయం కరువు
- అనధికారిక పార్కింగ్‌ను నియంత్రించాలని స్థానికుల విజ్ఞప్తి

**సారవకోట, ఆగస్టు 19 (వార్త):** సారవకోటలోని సచివాలయ భవనం దిగువ భాగం అనధికారిక వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తమ వాహనాలను నిలిపేందుకు స్థలం లేక అవస్థలు పడుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. సచివాలయానికి సంబంధం లేని కొందరు బయటి వ్యక్తులు తమ ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను భవనం దిగువ భాగంలో ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారని స్థానికులు తెలిపారు. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలకు వాహనాలు నిలిపేందుకు తగిన స్థలం అందుబాటులో లేకపోవడంతోపాటు, భవనం పరిసరాల్లో రాకపోకలకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం ప్రజలు సారవకోటకు వస్తుంటారు. అయితే సచివాలయ ప్రాంగణంలోనే ఇతరుల వాహనాలు అధికంగా నిలిచి ఉండటంతో తమ వాహనాలను ఎక్కడ ఉంచాలో తెలియక ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అనధికారికంగా వాహనాలను నిలిపే వారిపై నిఘా పెట్టి, పార్కింగ్ ప్రాంతాన్ని క్రమబద్ధీకరించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.




# ఆర్టీసీ విచారణ కేంద్రంలో సిబ్బంది కరువు

- బస్సుల రాకపోకలపై ప్రయాణికులకు అందని సమాచారం
- విచారణ కేంద్రంలో సిబ్బంది అందుబాటుపై అసంతృప్తి
- తక్షణ చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి

**నరసన్నపేట, ఆగస్టు 19 (వార్త):** నరసన్నపేట ఆర్టీసీ బస్‌స్టేషన్‌లోని విచారణ కేంద్రం వద్ద ప్రయాణికులకు బస్సుల రాకపోకల సమాచారం సక్రమంగా అందడం లేదని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల సమయాలు, రాకపోకల వివరాలు తెలుసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బస్సు ఎప్పుడు వస్తుంది, ఏ మార్గంలో వెళ్తుంది, తదుపరి సర్వీసు సమయం ఎంత వంటి వివరాలు తెలుసుకునేందుకు విచారణ కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నప్పటికీ అక్కడ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. సిబ్బంది ఎప్పుడు విధుల్లో ఉంటారో, ఎప్పుడు అందుబాటులో ఉండరో తెలియని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

విచారణ కేంద్రంలో సిబ్బంది లేకపోవడంతో ప్రయాణికులు ఇతర సిబ్బందిని ఆశ్రయించాల్సి వస్తోందని, కొన్నిసార్లు బస్సుల కోసం ఎక్కువసేపు వేచి చూడాల్సి వస్తోందని తెలిపారు. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలతో ప్రయాణించే వారు ఈ సమస్య కారణంగా మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించాలని, విచారణ కేంద్రంలో నిరంతరం సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. బస్సుల రాకపోకల వివరాలు స్పష్టంగా తెలియజేసే విధంగా సమాచార వ్యవస్థను కూడా మెరుగుపరచాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ప్రత్యక్ష ఎన్నికలతో స్థానిక పాలనకు కొత్త దిశ

- ప్రజలే చైర్మన్, మేయర్‌లను ఎన్నుకునే అవకాశం
- పరోక్ష ఎన్నికలతో ఏర్పడిన లాబీయింగ్‌కు తెర.. అభివృద్ధికి బాట
- మున్సిపాలిటీల్లో 33.33 శాతం బీసీ రిజర్వేషన్లపై హర్షం
-మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్

**పలాస, ఆగస్టు 19 (వార్త):** మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో చైర్మన్, మేయర్‌లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానం అమలులోకి రానుండటం స్థానిక పాలనలో కీలక సంస్కరణకు నాంది పలుకుతుందని పలాస మున్సిపాలిటీ చెందిన సీనియర్ మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ ప్రకటనలో బుధవారం తెలియజేశారు. ప్రత్యక్ష ఎన్నికలతో ప్రజలకు తమకు నచ్చిన, సమర్థత ఉన్న నాయకత్వాన్ని నేరుగా ఎన్నుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రివర్గం, ఎమ్మెల్యేల సమిష్టి నిర్ణయంతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రత్యక్ష ఎన్నికల విధానానికి సంబంధించిన తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టి ఆమోదించడం స్వాగతించదగిన పరిణామమన్నారు. పరోక్ష ఎన్నికల విధానంలో ఎదురైన సమస్యలు, లాబీయింగ్, రాజకీయ ఒత్తిళ్లను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ సంస్కరణకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఎన్టీఆర్ హయాంలోనే ప్రత్యక్ష విధానం ఉండేదని,

1986–87లో దివంగత నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌కు ఒక ఓటు, చైర్మన్‌కు మరో ఓటు వేసే విధానం అమల్లో ఉండేదని గుర్తుచేశారు. కార్పొరేషన్లలోనూ కార్పొరేటర్, మేయర్‌లకు వేర్వేరుగా ఓటు వేసే అవకాశం ఉండేదన్నారు. ఈ విధానం 2005 వరకు కొనసాగిందని పేర్కొన్నారు. 2005లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని రద్దు చేసి, కౌన్సిలర్లు చైర్మన్‌ను, కార్పొరేటర్లు మేయర్‌ను ఎన్నుకునే పరోక్ష విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. అప్పటి నుంచి సుమారు రెండు దశాబ్దాలుగా అదే విధానం కొనసాగిందని తెలిపారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోనూ ఇదే విధానం అమలులో ఉందన్నారు. లాబీయింగ్‌కు చెక్ పెడుతూ పరోక్ష ఎన్నికల సమయంలో చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు లాబీయింగ్, రాజకీయ సమీకరణాలు చోటుచేసుకునే పరిస్థితులు ఉండేవని తెలిపారు. పాలక మండళ్లలోనూ, కౌన్సిల్ సమావేశాల్లోనూ చైర్మన్‌పై వివిధ వర్గాల నుంచి ఒత్తిళ్లు వచ్చే సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ప్రత్యక్ష ఎన్నికల విధానంతో ఇలాంటి పరిణామాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉందన్నారు. అభివృద్ధికి మరింత అవకాశం ఏర్పడుతుందని,

ప్రజలే నేరుగా చైర్మన్, మేయర్‌ను ఎన్నుకోవడం వల్ల ప్రజల పట్ల బాధ్యత వహించే నాయకత్వం ఏర్పడుతుందని తెలిపారు. పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల సమస్యలపై అవగాహన, సేవాభావం, సమర్థత కలిగిన వ్యక్తులను ప్రజలు నేరుగా ఎన్నుకునే అవకాశం ఉంటుందని అన్నారు. పలాస–కాశీబుగ్గ ప్రాంతానికి కూడా ఈ మార్పు మంచి అవకాశమని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఐక్యతతో, అవగాహనతో వ్యవహరించి అభివృద్ధి పథంలో పట్టణాన్ని నడిపించే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. రెండు ఓట్లు.. స్పష్టమైన హక్కుతో మున్సిపాలిటీలో కౌన్సిలర్ ఎన్నికకు ఒక ఓటు, చైర్మన్ ఎన్నికకు మరో ఓటు వేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్పొరేషన్‌లో కార్పొరేటర్‌తో పాటు మేయర్‌ను కూడా ప్రజలే నేరుగా ఎన్నుకుంటారని వివరించారు. దీంతో ఓటరుకు స్థానిక పాలనలో తన అభిప్రాయాన్ని మరింత స్పష్టంగా వ్యక్తం చేసే అవకాశం లభిస్తుందని అన్నారు. మహిళలకు 33.33 శాతం రిజర్వేషన్‌పై హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ సంస్థల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించే నిర్ణయం పట్ల కూడా హర్షం వ్యక్తమైందని, మహిళల అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. సభలో ఈ అంశంపై చర్చకు వచ్చిన సందర్భంగా ప్రజాప్రతినిధులు, మహిళా వర్గాలు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

### ఎన్నికలకు సన్నద్ధం కావాలి

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు, రాజకీయ పార్టీలు,



నాయకులు ముందస్తుగా సన్నద్ధం కావాలని సూచించారు. పలాస ప్రాంత పాలక సంస్థను అభివృద్ధి దిశగా నడిపించేందుకు సమర్థమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రజలు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ సంస్కరణకు ముందడుగు వేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రివర్గం, తీర్మానానికి మద్దతు తెలిపిన ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల పాలనలో ప్రత్యక్ష ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యం పెరగడం భవిష్యత్తులో పట్టణాల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

## షాట్‌పుట్ లో కాంస్య పతకం



**ఇచ్ఛాపురం ఆగస్టు 19(వార్త):** ఏపీ స్టేట్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ 37వ ఛాంపియన్షిప్ 2026 పోటీలు తిరుపతిలో జరిగాయి. షాట్ పుట్ పోటీలలో కాంస్య పతకాన్ని స్థానిక స్వర్ణ భారతి జూనియర్ కాలేజ్ విద్యార్థి డొంకూరు గ్రామానికి చెందిన బుద్ధా భరత్ చంద్ర సాధించారు. ఈ సందర్భంగా స్వర్ణ భారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసి దాస్ రెడ్డి , విద్యార్థినీ, విద్యార్థులు భరత్ చంద్రను అభినందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజీ ఇంచార్జ్ చాట్ల రాము రెడ్డి, ప్రిన్సిపాల్ జల్లు జయప్రకాష్, పి.డి లు మదీనా, దుర్గ ప్రసాద్ ఆధ్యాపక బృందం పాల్గొన్నారు.

## నివగాంలో 'ఇంటింటికీ తెలుగుదేశం'



**కొత్తూరు, ఆగస్టు 19 (వార్త):** నివగాం పంచాయతీలో మండల టీడీపీ ఉపాధ్యక్షుడు బిల్లింగి సంజీవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెదేపా సీనియర్ నాయకులు లోతుగెడ్డ తులసీ వరప్రసాద్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పాతపట్నం నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా తులసీ వరప్రసాద్‌రావు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పేదలు, రైతులు, మహిళలు, యువత, వృద్ధులు, విద్యార్థుల సంక్షేమానికి పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. సంక్షేమంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్య, వ్యవసాయ రంగాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. నివగాం పంచాయతీ అభివృద్ధితో పాటు ప్రజా సేవా కార్యక్రమాల్లో బిల్లింగి సంజీవరావు చేస్తున్న కృషిని తులసీ వరప్రసాద్‌రావు అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. గ్రామంలో ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, ప్రతి కుటుంబాన్ని కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తులసీ వరప్రసాద్‌రావు పిలుపునిచ్చారు. నివగాం పంచాయతీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు, ప్రజల సమష్టి కృషితో ముందుకు సాగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు కోయిలాపు సంజీవరావు, మండల టీడీపీ అధ్యక్షుడు బిల్లింగి సంజీవరావు, మాజీ సర్పంచ్ పడాల వెంకటకృష్ణ, పాతపట్నం అసెంబ్లీ సెక్రటరీ బూరాడ కమలహాసన్, మండల తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ బూరాడ రాకేష్, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## కొరమీను సాగుతో లాభాలు బాగు

**మందస, ఆగస్టు 19(వార్త):** మహిళా సంఘాల సభ్యులలో ఆసక్తి ఉన్న ఎంటర్‌ప్రైనర్‌లకు కొరమీను సాగుతో లాభాలు బాగు ఉన్నట్లు సోంపేట మూలపొలం ఉదయ్ ఆక్వా ప్రతినిధి మనోహర్ స్పష్టం చేశారు. మందస వెలుగు కార్యాలయంలో ఏ.పీ.ఎం. పైడి కూర్మారావు ఆధ్వర్యంలో జరిగిన వెలుగు సిబ్బంది శిక్షణ, సమీక్షా కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. అనంతరం ఏ.పీ.ఎం. కూర్మారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో కేవలం వరి తదితర సాంప్రదాయ వ్యవసాయం కాకుండా వాణిజ్య పంటలు, పండ్ల తోటలు పెంపకం, తేనెటీగలు, పెట్టెలు ఏర్పాటు చేసుకోవడం, షేడ్ నెట్ వేసుకొని పూల మొక్కలు,కూరగాయలు పెంపకం, మత్స్య సాగుతో మంచి లాభాలు వస్తున్నాయని వాటిని జాగ్రత్తగా పెంచే యజమానులు చెబుతున్నారని వివరించారు. బోరు, కరెంట్ ఉన్న రైతులు తమ తోటలలో ట్యాంకులు ఏర్పాటు చేసుకొని చేప పిల్లల పెంపకంతో రైతులకు అదనపు ఉపాధి లభించి, స్థిర ఆదాయం వస్తుందన్నారు. దీని వల్ల ఉపాధి కోసం దూర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన అవసరం కూడా ఉండదన్నారు. ఒకే నీటిని చేపల పెంపకం, వ్యవసాయానికి వాడడం వల్ల నీటి ఆదా జరిగి భూగర్భ జలాల రీచార్జ్ కు సహాయ పడుతుందన్నారు. చేపల వ్యర్థాలు సహజ ఎరువుగా పని చేసి రసాయనాలు వాడకుండా మట్టికి హాని తగ్గి భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ తారక మోహన్, వెలుగు క్లస్టర్ కోఆర్డినేటర్లు, వి.ఓ.ఏ. లు, అకౌంటెంట్ కళ్యాణి, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.



## దళితవాడల్లో మౌలిక వసతులు కల్పించాలి



**పలాస, ఆగస్టు 19 (వార్త):** దళితవాడల్లో మౌలిక వసతులు కల్పించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ అధికారులకు కె వి పి యస్ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దళిత వాడల్లో జరిగిన సామాజిక శంఖరావం అధ్యయన యాత్రలలో అనేక సమస్యలు తమ బృందం దృష్టికి వచ్చాయని తెలిపారు. దళిత వాడల్లో కనీసం మౌలిక సౌకర్యాలు కూడా కల్పించలేని దుస్థితి కనబడిందని తెలిపారు. సూదికొండ కాలనీలో రోడ్లు, లేక నానా అవస్థలుపడుతున్నారు. ప్రభుత్వాలు మారిన తరువాత ఆ వార్డుల్లో ప్రభుత్వఅనుకూలమైన వారు అందరూ లేరని, ఒకరో ఇద్దరో వేరే పార్టీ వారు ఉన్నారని, కక్ష గట్టి రోడ్లు నిర్మించక పోవడం దారుణమని అన్నారు. మంచినీరు కూడా ఏర్పాటు చేయడంలో వివక్ష చూపుతున్నారని తెలిపారు. పారసాంబ గ్రామంలో మురికి కాలువలు, రెండు మూడు నెలలకు ఒకసారి కూడా క్లీన్ చేయకపోవడం వల్ల దోమలుతోప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని వివరించారు. పారసాంబ గ్రామం దళిత వాడలో గల చిన్న మండపం మరమ్మత్తులు చేయించాలని దరఖాస్తు చేస్తే స్థానిక యం యల్ ఎ కూడా దానిని పరిశీలించాలని రికమాండ్ చేసినా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. సబ్ ప్లాన్ నిధులు దళిత వాడల్లో ఖర్చు చేస్తే ఈ సమస్యలు ఎప్పుడో పరిష్కారం అయ్యేవని తెలిపారు. ఈ సమస్యలు వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, పారసాంబలో అంబేద్కర్ విగ్రహం వద్ద సామాజిక భవనం నిర్మించాలని కోరారు. ఈ డిమాండ్లుతో కూడిన వినతిపత్రం మున్సిపల్ మేనేజర్ త్రినాద్ కి అందజేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో కె వి పి యస్ నాయకులు తోట సిమ్మయ్య, డి రాజు సీఐటీయూ నాయకులు యన్ గణపతి, జె భాగ్యలక్ష్మి, సూదికొండ చెందిన యం నిర్మల, పారసాంబకి చెందిన బోనెల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల ప్రాణాలంటే లెక్క లేదా?

- ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డ శ్యామ్

**సోంపేట, ఆగస్టు 19 (వార్త):** ప్రజల ప్రాణాలు అంటే ఈ ప్రభుత్వానికి లెక్క లేదా అంటూ సర్కారు నిర్లక్ష్యంపై వైసీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గం సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. ఈ మండలం గొల్లవూరు పంచాయతీ దామోదర్ పురం గ్రామానికి సరైన రోడ్డు సదుపాయం లేక ఇటీవల ఓ నిండు గర్భిణీ తీవ్ర రక్తస్రావమై ఏడు నెలల పసిపందులు కోల్పోయిన విషయం తెలిసిందే. అస్తవ్యస్తమైన దామోదర్ పురం రహదారి పూర్తిగా గోతులతో నిండడం వలన ఆటోలో ప్రయాణం చేయడం... అంతకన్నా గత్యంతరం లేకపోవడంతో గర్భిణీ పరిస్థితి ప్రాణాంతకంగా మారింది. ఏడు నెలల బిడ్డను కోల్పోయి ప్రస్తుతం బరంపురంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత మహిళను శ్యాం ప్రసాద్ రెడ్డి బుధవారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. బరంపురం లోని స్థానిక రాజకీయ నాయకులతో మాట్లాడి వారితో వైద్యులకు మెరుగైన వైద్యం ఇప్పించాలని కోరారు. అనంతరం అక్కడి నుంచి వైసిపి నేతను నర్తు నరేంద్ర,మాజీ సర్పంచ్ పిన్నింటి ఈశ్వరరావు, ఎంపీటీసీ ప్రతినిధి రేఖరావులతో కలిసి దామోదర్ పురాన్ని సందర్శించారు. బాధిత కుటుంబం వద్దకు వెళ్లి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ తీరును అధికార యంత్రాంగం నిర్లక్ష్యాన్ని శ్యాం ప్రసాద్ రెడ్డి తప్పుపట్టారు. నిరంతరం అభివృద్ధి, సంక్షేమం అంటూ డబ్బా కొడుతున్న కూటమి ప్రభుత్వం పల్లెల్లోకి వెళ్లి ప్రత్యక్షంగా అభివృద్ధి ఏమిటో చూడాలని అన్నారు. ఇటువంటి దయనీయ పరిస్థితుల్లో పల్లె ప్రజలు బ్రతుకుతున్నారని వాపోయారు. 15 రోజుల్లోగా రోడ్డు నిర్మాణం చేయకపోతే న్యాయస్థానంలో పబ్లిక్ లిటిగేషన్ దాఖలు చేస్తానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాలిన గాంధీ, బంగారు విశ్వనాథం, ఎజ్జల యుగంధర్, భోగిరాజు ఉన్నారు.



## 22న రట్టిలో.. ప్రపంచ జానపద దినోత్సవం

- పలు పోటీలను నిర్వహించనున్న కళాకారులు




**మందస, ఆగస్టు 19(వార్త):** ఉద్దాన ప్రాంతమైన రట్టిలో ఈ నెల 22న ప్రపంచ జానపద దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మందస మండలంలోని భేతాళపురం పంచాయతీలో గల రట్టిలో ఈనెల 22 వ తేదీన ప్రపంచ జానపద దినోత్సవ శుభసందర్భంగా సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆద్వర్యంలో మందస మండలంలోని రట్టి గ్రామం లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు రట్టిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అంతరించిపోతున్న ప్రాచీన జానపద కళలు, విచ్ఛిన్నమౌతున్న భారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ–వీటి పునరిజ్జీవనం కోసం మనం తీసి కోవాల్సిన చర్యలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారు. అదే విధంగా రట్టి గ్రామంలో సాయంత్రం 6గంటల నుంచి జిల్లా స్థాయి జానపద సామాజిక పాటల పోటీలు నిర్వహించనున్నారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మామిడి కృష్ణారావు మాట్లాడుతూ శ్రమ జీవుల కష్ట సుఖాల నుంచి పుట్టి వచ్చినదే జానపదం.. ఇది మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ మానవతా విలువలను మానవ సంబంధాలను పెంపొందిస్తుందన్నారు. ఆదిమానవుడు తనకు చదువు రాకపోయినా కేవలం ప్రకృతి అందాలను ప్రవళించి పాడిన జానపదాలు మొదలు సుబ్బారావు పాణిగ్రాహి రాసిన జముకుల కథ, వంగపండు ప్రసాదరావు రాసిన భూభాగోతంలాంటి జానపదాలు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాయన్నారు. ఆధునిక పోకడలో చెవులు తూట్లు పడుతుంటే, అర్ధనగ్న నృత్యాలు వికారాలు పెడుతుంటే జానపదుల రీతులను స్వాగతించాలని, మన పూర్వీకులు నుంచి వచ్చిన ప్రాచీన జానపద కళారూపాలు పరిరక్షించాలని సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక పని చేస్తుందన్నారు. సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక ఆద్వర్యంలో జరుగుతున్న ప్రపంచ జానపద దినోత్సవానికి అందరూ హాజరు కావాలని, కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఆయనతో పాటు సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక కోశాధికారి గొరకల లోకేశ్వరరావు, ముఖ్య సలహాదారుడు దున్న రామారావు, కార్యవర్గ సభ్యులు పులారి పితంబరం, తలగాన గున్నయ్య, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఎరువులు.. రైతులకే అందాయి

**ఇచ్ఛాపురం ఆగస్టు 19(వార్త):** బిర్లంగి పంచాయతీలో ఎరువులు రైతులకే దక్కాయని ఈ విషయంపై వైయస్సార్సీపి నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి అవగాహనరాహిత్యంతో మాట్లాడటం సరికాదని మండల తెలుగుదేశం నాయకులు హితవు పలికారు. స్థానిక పిఏసిఎస్ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు లోపింటి పద్మనాభం పిఏసిఎస్ అధ్యక్షుడు పేదిని బాబ్జి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బిర్లంగిలో ఎరువులు పక్కదారి పట్టినట్లు మండల తెలుగుదేశం నాయకుడు దుపాన సూర్యనారాయణ పై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు.31 మంది రైతులు కూడా 80 బస్తాలు ఎరువులు ఆధార్ ఓటిపి ద్వారా అందించారని చెప్పారు. రైతులు యాప్ లో నమోదు చేస్తేనే ఓటిపి వస్తుందని ఆధార్ ద్వారా మాత్రమే ఎరువులు పంపిణీ జరిగిందని వివరించారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన బెందలం అశోక్ పై ఆరోపణలు చేస్తూ మాట్లాడడం శ్యాం ప్రసాద్ రెడ్డి అన్నారు. 20 నిమిషాల పాటు అసెంబ్లీలో రైతు సమస్యలపై నమస్కారం ఎమ్మెల్యే అశోక్ మాట్లాడారని చెప్పారు.గత ఐదేళ్లు వైయస్సార్సీపి పాలనపై తమ బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.గతంలో జరిగిన అవినీతిపై ఆధారాలు తో సహా బయట పెడతామని చెప్పారు.ఈ సమావేశంలో రాష్ట్ర నాటక పరిషత్ డైరెక్టర్ కామేశ్వరరావు,మండల సీనియర్ నాయకులు మెరుగు సూర్యనారాయణ,ధూపాన సూర్యనారాయణ రెడ్డి,ఆశి మాధవరెడ్డి, బోర యువరాజు వడ్డిన కురస్వామి బతకల గణపతి శంకర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546